క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: నానక్‌రాంగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐఐఆర్ ఎం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఎన్ వీడియా ఫీడర్ పరిధిలో....

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఎన్‌వీడియా విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వజ్రమ్ అపార్ట్‌మెంట్స్, వైజయంతి అపార్ట్‌మెంట్స్, ఎన్‌వీడియా, నానక్‌రాంగూడ, ప్రైమ్ అపార్ట్ మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే హోలీ వేడుకలను కూడా నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

రామచంద్రాపురం (పటాన్‌చెరు) : రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో నిర్వహించనున్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం, మల్లన్న జాతర ఏర్పాట్లను శనివారం కార్పొరేటర్ పుష్ప నాగేష్ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

అన్నమయ్య స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం సత్యకృతి నృత్యధామమ్ గురువు బాలాజీ శిష్యబృందం కూచిపూడి నృత్యార్చన సందర్శకులను అలరించింది. కళాకారులు దుర్గ, నిహారిక, అనిక, కృతిలు కొలువైతివా రంగసాయి, దశావతారాలు, గోవిందాశ్రిత గోకుల్‌బృందా అంశాలు ప్రదర్శించారు.



నానక్‌రాంగూడ వ్యూ



గుంతలుపడ్డ ప్రధాన రోడ్డు

అభివృద్ధి ఫలాలు కొందరికే..

- తీరని సమస్యలు.. పరిహారం అందక రైతుల ఇబ్బందులు
- ఇదీ 'నానక్‌రాంగూడ' పరిస్థితి

రాయదుర్గం: పచ్చని పొలాలు..చెరువులు.. పచ్చదనంతో ఒకప్పుడు నానక్‌రాంగూడ కళకళలాడేది. నేడు గ్రామీణ ప్రాంతరూపులే లేకుండాపోయాయి. మెట్రోసిటీని మరిపిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థల రాకతో ఆకాశహర్మ్యాలను తలపించే భవనాలు వచ్చాయి. ఇక త్వరలో నానక్‌రాంగూడకు మెట్రో రైలు కూడా రానుంది. రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి నానక్‌రాంగూడ



నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్

మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. చుట్టూరా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఉన్నా అభివృద్ధి లేదనే విమర్శ స్థానికుల నుంచి వినిపిస్తోంది. గతంలో ప్రభుత్వం ఇక్కడి భూములను ఐటీ సంస్థలకు ఇవ్వడంతో బహుళ అంతస్తులు వెలిశాయి. కానీ నానక్‌రాంగూడ మాత్రం అభివృద్ధి చెందలేదని అంటున్నారు.

- స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి
- బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు
- పూర్తిస్థాయి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ
- మేడికుంట చెరువు అభివృద్ధి
- ఆర్టీసీ బస్సులను మెహిదీపట్నం, కోఠి, సికింద్రాబాద్ ప్రాంతాలకు నానక్‌రాంగూడ మీదుగా ఐటీ కారిడార్‌కు నడపాలని స్థానికుల డిమాండ్ .



కలుషితమైన మేడికుంట చెరువు



నానక్‌రాంగూడలో ప్రధాన రోడ్డుపైనే సంత నిర్వహణ

భూబాధితులకు న్యాయం చేయాలి



నానక్‌రాంగూడ పట్టా భూములను తీసుకొని ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదు. మాకు న్యాయం చేయాలి. స్థానికంగా సౌకర్యాలను మెరుగుపర్చాలి. చుట్టూరా అద్దాల మేడలు, రోడ్లు, బస్సు సౌకర్యాలను కల్పించారు. కానీ మా నానక్‌రాంగూడకు బస్సులను తగ్గించారు. ఐటీకారిడార్ తరహాలో అభివృద్ధి చేయాలి.

–జి. ముత్యంరెడ్డి, నానక్‌రాంగూడ

మౌలిక వసతులు కల్పించాలి



నెలకు రూ.450 తీసుకుంటున్నా నీళ్లు చాలడంలేదు. నీటి సరఫరాను మెరుగు పర్చాలి. టీఎస్ఐఐసీ నానక్‌రాంగూడను దత్తత తీసుకోవాలి. మేడికుంటను సుందరీకరించాలి. ఇక్కడ భూములను కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేయాలి.

–రమేష్‌గౌడ్, నానక్‌రాంగూడ

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడికి లోనవ్వొద్దని సూచించారు. తప్పనిసరిగా రోజుకు 4 లీటర్ల నీళ్లు తాగాలని, తగినంత నిద్రపోవాలన్నారు. పరీక్ష సమయంలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన విషయాలను ఆయన వివరించారు.

వసతులు కల్పించాలని వినతి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని మైత్రి హోమ్స్ కాలనీలో వసతులు కల్పించాలని కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలను అందించారు. కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, గోపాలమ్మల ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ అప్పట్లో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం మున్సిపల్ నిబంధనల ప్రకారం ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నామన్నారు. వీధిదీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కాలనీవాసులు చెప్పారు.

సమస్యను పరిష్కరించినప్పుడే సాంకేతికతకు విలువ

రాయదుర్గం: సమస్యను పరిష్కరించినప్పుడు సాంకేతికతకు విలువ ఉంటుందని కలారి క్యాపిటల్ భాగస్వామి రవీందర్‌సింగ్ అన్నారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ 42 సమ్మిట్‌ను నిర్వహించారు. 150కిపైగా స్టార్టప్‌లు, కార్పొరేటు ఇంక్యుబేటర్లు ఒకేచోట చేరారు. ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ రమేష్‌లోకనాథన్ మాట్లాడుతూ నగరంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చుట్టూ చాలా జరుగుతున్నాయన్నారు. యువ పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన

మియాపూర్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.శనివారం హుడా కాలనీలోని విద్యావాణి హైస్కూల్‌లో ప్రదర్శనను ఎమ్మెల్యే ప్రారంభించారు. నమూనాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల చైర్మన్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ లీల.. నృత్య హేల



వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో శనివారం నృత్య కళాభారతి గురువు కోన జానకి మోహన్‌రావు శిష్యబృందం పాహిపాహి గజానన, రామదాసు కీర్తనలు, వినాయక నృత్యం, భామాకలాపం, లింగాష్టకం, శ్రీకృష్ణ లీల తరంగిణి కూచిపూడి అంశాలను ప్రదర్శించి అలరించారు. కాగా జీ-20 సమ్మిట్‌కు హాజరైన 40 దేశాలకు చెందిన 45 మంది డెలిగేట్స్ శిల్పారామాన్ని సందర్శించారు. - మాదాపూర్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



గచ్చిబౌలి: పేద, మధ్యతరగతి వారికి ఆపన్నహస్తం 'సీఎంఆర్ఎఫ్' అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, పార్లమెంటు సభ్యులు రంజిత్‌రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురు అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను వారు అందించారు. ఆర్టీసీ కాలనీకి చెందిన వెంకట భాస్కరరావుకు రూ.2.50 లక్షలు, డైనమిక్ కాలనీకి చెందిన మౌనికకు రూ.2లక్షలు, తారానగర్‌కు చెందిన నిఖిల్‌కుమార్‌కు రూ.2లక్షల ఎల్‌ఓసీ పత్రాలను అందించారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన రవికుమార్‌యాదవ్

మియాపూర్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు.మియాపూర్ డివిజన్ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల, మక్తమహబూబ్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ కేవై ఫౌండేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

మియాపూర్: మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్ కాలనీలో శ్రీ పద్మావతి అండాలు సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఇండస్ట్రియల్ క్రికెట్ ప్రారంభం

పటాన్‌చెరు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత చదువు, ఉద్యోగంతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఉదయం ఎమ్మెల్యే ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, అమీన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, చంద్రశేఖర్, ఎండీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణిస్తున్న కారులో మంటలు



మియాపూర్: ప్రయాణిస్తున్న కారులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి కారు పూర్తిగా కాలిపోయిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని మదీనాగూడకు చెందిన ప్రవీణ్ తన తల్లి లక్ష్మీతో కలిసి టాటా ఇండిగో కారులో శేరిలింగంపల్లి నల్లగండ్లకు వెళ్లి చందానగర్ మంజీరా రోడ్డు నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కారులో అకస్మాత్తుగా మంటలు రేగాయి. అప్రమత్తమైన ప్రవీణ్, తల్లి లక్ష్మీ వెంటనే కారులో నుండి దిగిపోయారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో పటాన్‌చెరు నుంచి అగ్ని మాపక సిబ్బంది వచ్చే లోపు కారు పూర్తిగా కాలి పోయింది. ఏ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

సిల్క్ ఇండియా ఎక్స్‌పో



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహిస్తున్న సిల్క్ ఇండియా ఎక్స్‌పో సందర్శకులను ఆకట్టుకుంటుంది. శనివారం సెలవురోజు కావడంతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఒరిస్సా, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, పంజాబ్, మణిపురి ఉత్పత్తులను నగరవాసులకు అందుబాటులో ఉంచారు. ఎక్స్‌పోలో వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక చీరలు అందు బాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 9వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని ఉదయం 10గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

సందడిగా మాతృశక్తి అవార్డుల ప్రదానం



అవార్డును ప్రదానం చేస్తున్న దృశ్యం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామం ఎత్నిక్‌హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు మాతృశక్తి అవార్డులను ప్రదానం చేశారు. సంఘసేవకురాలు నడింపల్లి యమున పథక్, లయన్స్‌క్లబ్ మాతృశక్తి సంయుక్త నిర్వహణలో దాదాపు 150 మంది మహిళలకు అవార్డులను ప్రదానం చేశారు. భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధరశాస్త్రి, సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞశర్మ, డాక్టర్ రవికాంత్ ఏవిధంగా మహిళలు ముందుకు సాగుతూ పురోగతి సాధించాలో ప్రసంగించారు. మాతృశక్తి అవార్డులను పద్మశ్రీ శోభరాజ్, రచయిత జలంధర చంద్రమోహన్, ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మల్లవరపు బాలలత, సీనియర్ జర్నలిస్ట్ స్వప్న, డాక్టర్ లక్ష్మి తదితరులకు ప్రదానం చేశారు.